క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై రాజేష్

కంభం: సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై పులి రాజేష్ హెచ్చరించారు. పట్టణంలోని వైజంక్షన్, కంభం బస్టాండ్, కందులాపురం కూడలిలో సోమవారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు తీసుకొని హైవే రోడ్లపైకి వచ్చేస్తున్నారని, తల్లిదండ్రులు జాగ్రత్త వహించి పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, లైసెన్స్, ఇతర ధృవీకరణ పత్రాలు లేకున్నా జరిమానాలు విధించనున్నట్లు పేర్కొన్నారు. బుల్లెట్, స్పోర్ట్స్ వాహనాలు నడిపే వారు కంపెనీ నుంచి వచ్చిన సైలెన్సర్లను మాత్రమే వినియోగించుకోవాలని, వాటిని తొలగించి అధిక శబ్దాలు వచ్చే సైలెన్సర్లను బిగించుకొని ప్రజలను ఇబ్బంది పెడితే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ఆటోలు నడిపే పరిమితిని మించి ప్రయాణికులను ఎక్కించుకో కూడదని సూచించారు.

రెండు క్రాకర్స్ షాపులపై కేసు నమోదు

- రూ.27 వేల దీపావళి మందులు సీజ్


క్రాకర్స్ దుకాణాన్ని సీజ్ చేస్తున్న సీఐ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో అనుమతి లేకుండా క్రాకర్స్ అమ్ముతున్న దుకాణాలపై సోమవారం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు షాపులకు పర్మిట్ లేదని, దీంతో ఆ షాపులకు చెందిన సుమారు రూ.27 వేల విలువ చేసే దీపావళి మందులను సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా దీపావళి మందులు అమ్మే షాపులపై కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ సందర్భంగా క్రాకర్స్ యజమానులు ఇష్టం వచ్చినట్లుగా క్రాకర్స్ అమ్మకూడదని సూచించారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు


వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. 25 మంది విద్యార్థులకు పాటల పోటీలు, క్విజ్ పోటీలు, ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్, కథలు చెప్పడం, కథలు వినిపించడం, చెస్, క్యారమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థినీ, విద్యార్థులను వేసవి శిక్షణ తరగతులకు పంపించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కోరారు.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి

- నివాళులర్పించిన బూచేపల్లి


నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి: మండలంలోని లంకోజనపల్లి గ్రామానికి చెందిన ఎబ్బిలి నరసింహారావు గుండెపోటుతో మృతి చెందారు. నరసింహారావు మృతదేహానికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని, ఎటువంటి ఇబ్బందులు వచ్చినా నేరుగా తనను కలవాలని సూచించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

దొనకొండ: ఉపాధి హామీ పథకంలో కూలి గిట్టుబాటు అయ్యే వరకు పనులు చేసి వేతనాలు పొందాలని ఏపీఓ టి.దేవయ్య తెలిపారు. సోమవారం ఆయన గంగదేవిపల్లి గ్రామంలో ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన వేతనం రావాలంటే తప్పనిసరిగా కొలతల ప్రకారం పని చేయాలన్నారు. వీలైనంత వరకు ఉపాధి పనులను ఉదయం చేసుకోవాలన్నారు. వేతనాలు పెండింగ్ లేకుండా వారి బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తున్నామని ఏపీఓ తెలిపారు.

19 రౌండ్లలో ఎన్నికల కౌంటింగ్

- సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం: వచ్చే నెల 4వ తేదీన ఒంగోలులోని రైజ్ కాలేజీలో మార్కాపురం అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంట్ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని సబ్ కలెక్టర్, మార్కాపురం ఆర్‌ఓ రాహుల్‌మీనా చెప్పారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. రైజ్ కాలేజీలోని మూడో స్టేర్‌లో మూడు రూములను మార్కాపురం ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కేటాయించినట్లు తెలిపారు. మొత్తం 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తామని, 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పోలింగ్ ఏజెంట్లు అందరూ ఉదయం 6 గంటలకల్లా కేంద్రానికి చేరాలన్నారు. అనంతరం స్ట్రాంగ్ రూములు ఓపెన్ చేస్తామని చెప్పారు. మొదటిగా 8 గంటలకు పోస్టల్ బ్యాలట్ లెక్కింపు ప్రారంభమవుతుందని, అనంతరం ఈవీఎంల లెక్కింపు జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటల తరువాత మొదటి రౌండ్ ఫలితం వచ్చే అవకాశం ఉందన్నారు. మొత్తం మూడు అంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ టీవీ, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ సిబ్బంది అందరి కంటే ముందుగా కేంద్రానికి వస్తారని తెలిపారు.


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

3040 పోస్టల్ బ్యాలెట్‌లు:
మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించి ఈనెల 25వ తేదీ నాటికి మొత్తం 3040 పోస్టల్ బ్యాలెట్లు వచ్చినట్లు తెలిపారు. ఇందులో ఎన్నికల డ్యూటీ, పీఓలు, ఏపీఓలు, పోలీసు, సెక్టార్ ఆఫీసర్స్ తదితర విభాగాలకు చెందిన వారు 2351 మంది, ఎసెన్షియల్ సర్వీసెస్ కింద 244 మంది, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎన్నికల డ్యూటీ చేసిన వారు 153 మంది, ఇంటర్ డిస్ట్రిక్ట్ ఎసెన్షియల్ సర్వీస్ విభాగంలో 18 మంది, హోమ్ ఓటింగులో 169 మంది, సర్వీసు ఓటర్లు 105 మంది మొత్తం 3040 మంది పోస్టల్ బ్యాలట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- మార్కాపురం డీఎస్పీ బాలసుందర్‌రావు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుందర్‌రావు

కంభం: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం డీఎస్పీ బాలసుందర్‌రావు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, అత్యుత్సాహానికి వెళ్లి గొడవలకు దిగితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీషీట్‌లు తెరుస్తామని హెచ్చరించారు. ఇటీవల ముగిసిన ఎన్నికలకు మార్కాపురం డివిజన్ పరిధిలో ప్రజలు అందించిన సహకారం మరువలేదని, ఒకటి రెండు చోట్ల చిన్నపాటి గొడవల మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా పల్లెనిద్ర, కార్డెన్ సెర్చ్, పీస్ కమిటీ సమావేశాలు చేపట్టి గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. పోలీసులు రోజూ గ్రామాల్లో తిరిగి సమాచారం సేకరిస్తున్నారన్నారు. పాతనేరస్తులను పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు యాక్టివ్‌గా ఉన్న వారిని బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా సంబరాలు, ర్యాలీలు నిషేధమని తెలిపారు. బాణసంచా విక్రయాలు జరిపితే అటువంటి దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలకు ముందు ఏ విధంగా పోలీసులకు సహకరించారో కౌంటింగ్ సమయంలో కూడా ప్రజలు సంయమనం పాటించి పోలీసులకు సహకరించాలని, చట్టాన్ని అతిక్రమించి ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, ఘర్షణలకు దిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కంభం సీఐ జె. రామకోటయ్య, ఎస్సై పులిరాజేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు


వ్రతంలో పాల్గొన్న ఉభయదాతలు


హోమం చేస్తున్న అర్చకులు, ఉభయ దాతలు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో 12వ ద్వాదశ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకట రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం భక్తుల జయజయ ధ్వానాలతో, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళ వాయిద్యాలతో నిర్వహించారు. స్వామివారి వ్రతం ఉభయ దాతలుగా పొదిలి విశ్వనాథపురానికి చెందిన దివ్వెల, పేరం, బొగ్గరపు, కొప్పరపు, చెక్కా, పాలువాది కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. ఉత్సవాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. మంగళవారం రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి వారి కల్యాణం ఉంటుందని, అలాగే జూన్ 1వ తేదీ వరకు శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, వి.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

భక్తుల కొంగు బంగారం ఈదర అంకమ్మతల్లి


పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు


పూజలు చేస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో అంకమ్మతల్లి

ముండ్లమూరు: మండలంలోని ఈదర అంకమ్మతల్లి 168వ వార్షికోత్సవం సోమవారం వైభంగా జరిగింది. ఈదర అంకమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చడంతో భక్తుల కొంగు బంగారంగా పేరుగాంచింది. ఈ సందర్భంగా మండలంలోని భీమవరం, అయోధ్యనగర్, కొమ్మవరం, బొప్పూడివారిపాలెం, రమణారెడ్డిపాలెం, వేములబండ, వేముల, పూరిమెట్ల, ఉమామహేశ్వరపురం గ్రామాలతో పాటు పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్తులు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఊయలు ఊపితే సంతానం లేని వారికి సంతానం కలుగుతారనే నమ్మకం ఉంది. దీంతో గతంలో కోరిన కోర్కెలు నెరవేరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు అన్నదానం చేశారు. ఆలయ పూజారి సత్యనారాయణశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యశాఖ వారు వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. ఈదర సమస్యాత్మక గ్రామం కావడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్ట భద్రత చర్యలు తీసుకున్నారు.

భారీ మెజారిటీతో గెలుస్తున్నాం


పాత మల్లవరంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న దద్దాల నారాయణ

హనుమంతునిపాడు: కనిగిరిలో భారీ మెజారిటీతో విజయం సాధిస్తామని వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండలంలోని కూటాగుంట్ల పంచాయతీ పరిధిలోని పాతమల్లవరంలో సోమవారం జరిగిన నాగారపు వెల్లమ్మ కొలుపుల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరోసారి జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీ ఓటు వేశారని, భారీ మెజారిటీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, సర్పంచ్ గాలం రామక్రిష్ణ, గుడిపాటిపల్లి సర్పంచ్ కటికల వెంకటరత్నం, మాజీ సర్పంచ్ బైనబోయిన కాటంరాజు, నాయకులు గాండ్లపర్తి ఆది నారాయణరెడ్డి, ముసలయ్య, నాగార్జునరెడ్డి, కోటపాటి మోహన్‌రెడ్డి, వెంకటస్వామిరెడ్డి, వెంకటరెడ్డి, కె.వెంకటకాశయ్య, గాలం తిరుపతయ్య, నాలి వెంకటేశ్వర్లు, టి.తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలి

- విద్యుత్ శాఖ డీఈఈ పిచ్చయ్య


సిబ్బందితో మాట్లాడుతున్న డీఈఈ పిచ్చయ్య

ముండ్లమూరు: మండలంలో పెండింగ్ విద్యుత్ బకాయిల వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యుత్ శాఖ దర్శి సబ్ డివిజన్ డీఈఈ కోపేర్ల పిచ్చయ్య తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ మండలంలో వివిధ శాఖలు, గృహ వినియోగదారులు, రైతుల వద్ద నుంచి కోటి ఐదు లక్షల రూపాయల విద్యుత్ బకాయిలు ఉన్నట్లు తెలిపారు. అందులో ప్రధానంగా వ్యవసాయ బోర్ల నుంచి రూ.45 లక్షలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.30 లక్షలు, గృహ వినియోగదారులు, పంచాయతీల నుంచి రూ.30 లక్షలు వరకు ఉన్నాయన్నారు. వాటి వసూళ్లకు సిబ్బంది ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ బోర్లకు నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వర్షాలు, ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, విరిగి పడటం లాంటివి జరిగితే తక్షణమే వాటిని పునరుద్ధరించాలన్నారు. గ్రామాలు, పొలాల్లో ప్రధాన విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్లను తొలగించాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ లైన్‌లు కిందకు వేలాడుతుంటే వాటిని సరిచేయాలన్నారు. సిబ్బంది సమన్వయంతో పని చేసి వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట లైన్‌మెన్ పి.వీ రాంజనేయులు, జేఎల్‌ఎంలు హరికృష్ణ, నాగరాజు, దేవదాసు పాల్గొన్నారు.


గొట్లగట్టు పొలాల్లో పచ్చిక మేస్తున్న పశువులు

వర్షంతో పొలాల్లో పచ్చిక

కొనకనమిట్ల: ద్రోణి ప్రభావంతో ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలు ఎండవేడి నుంచి కొంత ఉపశమనం కలిగించాయి. అంతే కాకుండా భూములు పదును కావటంతో పొలాల్లో పచ్చిక పడింది. దీంతో పశువులు, గొర్రెలు, మేకలకు పొలాల్లోని పచ్చిక బాగా ఉపయోగపడుతుంది. ఇటీవల వరకు ఎండుగడ్డి మీదే ఆధారపడిన పశువులు ప్రస్తుతం పచ్చిక పొలాల్లో తిరుగుతూ పచ్చిగడ్డి మేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కుంటలలోకి నీరు రావటంతో పాటు పొలాల్లో పచ్చిక పడటంతో రైతులకు ఎంతగానో ఉపయోగంగా ఉంది. తమ పశువులకు నీరు, మేత అందుతుండటంతో పశుపోషకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గనివానిపాడు పొలాల్లో వర్షం నీరు

నీటి ఎద్దడి నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

మార్కాపురం రూరల్: వేసవిలో నీటి ఎద్దడి సమస్యను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మార్కాపురం ప్రాంతంలో నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను అధికారులు గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా మార్కాపురం మండలంలోని పెద్దయాచవరం, పెద్ద నాగులవరం, మన్నెంవారిపల్లి, నాయుడుపల్లి, మిట్టమీదిపల్లి, క్రిస్టియన్‌పాలెం, బోడపాడు గ్రామాల్లో నీటి సమస్య ఉన్నట్లు అధికారులు గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. అయితే ప్రస్తుతం అందిస్తున్న ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ప్రజలకు సరఫరా సరిపోవడం లేదని, అదనపు ట్రిప్పులు పెంచాలని ప్రతిపాదించారు. పెద్దయాచవరంలో 4, పెద్ద నాగులవరంలో 12, మన్నెంవారిపల్లి 4, నాయుడుపల్లి 8 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అవుతోంది. అయితే మిట్టమీదిపల్లిలో 10, క్రిస్టియన్‌పాలెంలో 2, బోడపాడులో 10, పెద్దయాచవరంలో 10, పెద్దనాగులవరంలో 8, మన్నెంవారిపల్లిలో 2, నాయుడుపల్లిలో 4 ట్రిప్పులు అదనంగా కావాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపారు. త్వరలో ఆమోదం రానుంది. ఎంపీడీవో తోట చందన మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని, ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామని చెప్పారు.

వీడియోగ్రాఫర్లకు నిధులు చెల్లించాలి


వినతి పత్రం అందజేస్తున్న వీడియోగ్రాఫర్లు

గిద్దలూరు రూరల్: ఎన్నికల విధుల్లో పాల్గొన్న వీడియో గ్రాఫర్లకు నిధులు వెంటనే చెల్లించాలని కోరుతు వీడియో గ్రాఫర్ల సంఘ అధ్యక్షుడు బొంతా ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావుకు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో రోజు వారీగా పనిచేసిన వారికి రూ.3 వేల ప్రకారం, షిఫ్టుల ప్రకారం విధులు నిర్వహించిన వారికి రూ.2100 ప్రకారం చెల్లించాలని కోరారు. వీడియో గ్రాఫర్లు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నా డబ్బులు చేతికి ఇవ్వకపోయినా ముందుగానే పనిచేశామని గుర్తు చేశారు. ఉన్నతాధికారులు తమ సమస్యలను గుర్తించి సానుకూలంగా స్పందించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే తమ నిధులు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీడియో గ్రాఫర్ల సంఘ వైస్ ప్రెసిడెంట్ లొక్కు శరత్‌బాబు, సభ్యులు ప్రసాద్, భాను, మల్లి, ప్రతాప్, రంగనాయకులు, మస్తాన్, చిన్నా పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి అలవెన్సులు ఇవ్వాలి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

మార్కాపురం టౌన్: సాధారణ ఎన్నికల్లో విధులు నిర్వహించిన మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు అలవెన్సులు వెంటనే చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందించారు. జిల్లా కార్యదర్శి రఫీ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో అవుట్ సోర్సింగ్ కార్మికులు ఎన్నికల విధులు నిర్వర్తించారని, వారికి ఇంత వరకూ అలవెన్సులు చెల్లించలేదని తెలిపారు. పెండింగ్ అలవెన్సులు వెంటనే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు హరి, సుబ్బరాయుడు, ఇమాంసా, సలాం తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

కురిచేడు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఎస్సీ విద్యార్థులకు నేరుగా ప్రవేశం కల్పించనున్నట్లు ప్రిన్సిపల్ కె.ఆరోన్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకోసం ఈ నెల 28న దర్శిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలింగ్‌కు గతంలో ప్రవేశ పరీక్ష రాసి సీటు రానివారితో పాటు పరీక్షకు హాజరు కాని వారు కూడా తగిన ఆధారాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

తాళ్లూరు (ముండ్లమూరు): మండల కేంద్రం తాళ్లూరు ఎస్టీ కాలనీలో సోమవారం సాయంత్రం పోలీసులు నిర్వహించిన కార్డెన్ చర్చ్ కార్యక్రమంలో 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వైవీ రమణయ్య తెలిపారు. స్థానిక ఎస్టీ కాలనీలో సిబ్బందితో కలిసి విస్తృతంగా ఇంటింటా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారు.